సాక్షి మంచిర్యాల

మంగళవారం । 26 । మార్చి । 2024



కొడితే 'ప్రతిష్టాత్మక' సీటే 8లో▸

8లో▸

సీవోఈ కళాశాల విద్యార్థులు పోటీపరీక్షల్లో ప్రతిభ కనబర్చి ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో సీట్లు కైవసం చేసుకుంటున్నారు. ఈసారి కూడా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ :6:30	బుధ : 4:52

గరిష్టం/కనిష్టం
38.6 /25.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

భైరవుడిని దర్శించుకున్న జడ్జి



భైరవస్వామి సన్నిధిలో జడ్జి అర్జున్

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి గ్రామంలో కొలువైన భైరవస్వామిని పెద్దపల్లి సెషన్స్ కోర్టు సీనియర్ జడ్జి అర్జున్ సోమవారం దర్శించుకున్నారు. భైరవుడికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ ప్రాశస్త్యం గురించి ఆలయ సిబ్బంది జడ్జికి వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్యాం పాల్గొన్నారు.

'గూడెం'లో పౌర్ణమి జాతర



సామూహిక సత్యనారాయణ నోము..

దండేపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం ఫాల్గుణ పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. జిల్లాతోపాటు, కరీంనగర్, జగిత్యాల జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 124 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోములో పాల్గొన్నాయి. జాతర సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

అలరించిన కైతల 'ఎన్నీల'



మాట్లాడుతున్న తెరవే జిల్లా అధ్యక్షుడు రాజేశం

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కైతల ఎన్నీల అలరించింది. పట్టణానికి చెందిన కథా రచయిత శ్రీమాన్ రాసిన కారూన్ కథా సంపుటి పరిచయం చేశారు. వేదిక అధ్యక్షుడు టి.రాజేశం మాట్లాడుతూ జిల్లా నుంచి అతి తక్కువ సంఖ్యలో కథా సంపుటిలు వస్తున్నప్పటికీ ఇక్కడి జీవితాలను ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప కథలు వస్తున్నాయన్నారు. శ్రీమాన్ రాసిన కారున్ కథా సంపుటి ఐదు కథలు వేటికవే ప్రత్యేకమైనవన్నారు. రచయిత దృక్పథం కథలలో ప్రతిబింబించిందన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో కవులు నాగవర్మ ముత్యం, శ్రీమాన్, శిరిసినహల్, నీలా దేవి, రాజయ్య, రాధేశ్యాం, బి.రాజిరెడ్డి, యోగేశ్వర్, భూమన్న, నవ్య కవితాగానం అలరించింది.

నేడు మంచిర్యాలకు 'కొప్పుల'

మంచిర్యాలటౌన్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం పర్యటిస్తారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తెలిపారు. ఉదయం 6 గంటలకు పాతగర్మిళ్లలోని శ్రీభక్తాంజనేయ స్వామిని దర్శించుకుని, ఉదయం 6:40 గంటలకు వాకర్స్‌ను కలుస్తారని వివరించారు.

హోలీ సంబురం



గౌతమినగర్‌లో దంపతుల హోలీ



గౌతమినగర్ తెలంగాణతల్లి చౌరస్తాలో హోలీ వేడుకల్లో స్థానికులు



వైశ్యభవన్ వద్ద నృత్యాలతో సందడి..

జిల్లాలో హోలీ సంబురాలు అంబరాన్ని తాకాయి. సోమవారం తెల్లవారు జామునుంచే జనం రంగుల వేడుకల్లో మునిగిపోయారు. చిన్నాపెద్ద, స్త్రీపురుష భేదం లేకుండా అందరూ ఉత్సాహంగా రంగుల వేడుకల్లో పాల్గొన్నారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకుని రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. మంచిర్యాల పట్టణంలోని పలు వీధుల్లో డీజే పాటలకు అంతా స్టెప్పులేశారు. రంగుల్లో మునిగితేలారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో సీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో పోలీసులతో కలిసి స్టెప్పులేశారు.మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన వేడుకల్లో డీసీపీ అశోక్‌కుమార్, సీఐ భన్సీలాల్ వేడుకల్లో పాల్గొన్నారు. – మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలక్రైం



హోలీ సంబురాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి నృత్యం చేస్తున్న సీపీ శ్రీనివాసులు



హమాలీవాడలో ఓ అపార్ట్‌మెంట్‌లో హోలీ సంబురాలు

హస్తంలో అసంతృప్తి!



- గడ్డం వంశీకి ఎంపీ టికెట్‌పై గుర్రు
- ఒకే కుటుంబానికి అవకాశాలపై చర్చ
- అసంతృప్తులకు బుజ్జగింపుల పర్వం
- లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి రగులుతోంది. గడ్డం వంశీకృష్ణకు ఎంపీ టికెట్ ఖరారుతో ఆ పార్టీలో టికెట్ ఆశించిన నాయకులు గుర్రుగా ఉన్నారు. తాత నుంచి మనవడి దాకా పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని అప్పగించడంపై సీనియర్లు, స్థానిక నాయకుల్లో ఒకింత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తూ, జెండా మోస్తున్న వారికి కాకుండా పార్టీలు మారిన 'పెద్ద' కుటుంబాలకే అవకాశాలు ఇవ్వడంపై పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో చర్చ జరుగుతోంది. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు పెద్దపల్లిలో కుటుంబ పాలన అంటూ తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల నుంచే...

గత అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ప్రస్తుత చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ బీజేపీలో ఉన్నారు. ఆ సమయంలో ఆ పార్టీ నుంచే చెన్నూరు ఎమ్మెల్యేగా, లేకపోతే ఎంపీగా పోటీ చేస్తారని కమలనాథులు ఆశపడ్డారు. ఆ మేరకు గట్టి ప్రయత్నాలే చేశారు. సరిగ్గా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు కేవలం మూడు రోజుల ముందు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరేప్పుడు ఎంపీ, లేక ఎమ్మెల్యేగా పోటీ చేస్తారనే చెప్పుకొచ్చారు. చివరకు ఎమ్మెల్యేగా పోటీ చేయడంతో అప్పటి దాకా కాంగ్రెస్ పార్టీలో టికెట్‌పై ఆశలు పెట్టుకున్నవారి ఆశలు ఆవిరయ్యాయి. ఆ సమయంలో కొందరు కాంగ్రెస్ పార్టీని వీడగా, మరికొందరు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఆ ఎన్నికల్లో వివేక్ గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. తాజా పార్లమెంట్ ఎన్నికల్లోనూ తనయుడికి టికెట్ తెచ్చుకునేందుకు ఢిల్లీ స్థాయిలో పరపతి ఉపయోగించారు. కొడుకు వంశీకృష్ణకు టికెట్ ఇప్పించగలిగారు.అదే ఫ్యామిలీ నుంచి బెల్లంపల్లి ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్ పార్టీలో ఉన్నారు. దీంతో ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి టికెట్లు ఇవ్వడంపై సొంత పార్టీలోనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.

మాదిగల్లో వ్యతిరేకత

పెద్దపల్లి పరిధిలో కాంగ్రెస్ టికెట్ మాదిగలకు ఇస్తారనే గట్టి నమ్మకంతో ఆ సామాజిక వర్గం ఆశలు పెట్టుకుంది. కానీ మాల సామాజికవర్గానికే కేటాయించడంతో ఆ వర్గం వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే ఈ విషయాన్ని ఇక్కడి నాయకులు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో నిరసనలు తెలుపుతున్నారు. అయితే ఒకసారి టికెట్ ఖరారు తర్వాత ఏమీ చేయలేని పరిస్థితి ఉండడంతో బుజ్జగింపులు మొదలయ్యాయి. మరోవైపు ఎంపీ బరిలో వంశీ దిగుతున్న నేపథ్యంతో తనయుడి కోసం ఎమ్మెల్యే వివేక్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. వ్యతిరేకతలు బయటపడకుండా 'మేనేజ్' చేస్తున్నారు. కీలక నేతల్ని కలుస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలందరి మద్దతు, సీనియర్ నాయకులు, కుల సంఘాలు, తమకు వ్యతిరేకంగా ఉన్నవారిని 'సెట్' చేసుకుంటున్నారు. ఓడిపోతే అధిష్టానం దృష్టిలో పరపతి దెబ్బతినడంతోపాటు తనయుడి రాజకీయ భవిష్యత్తు, తన రాజకీయం ఇబ్బందుల్లోపడే అవకాశాలు ఉంటాయి. దీంతో అటు ప్రజల్లో, ఇటు పార్టీలో పట్టు పెంచుకునేందుకు విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజా మాజీలతోపాటు బీఆర్ఎస్ నుంచి నాయకులు, కార్యకర్తలకు పార్టీలోకి వచ్చేందుకు ఆఫర్లు ఇస్తున్నారు. ఏడు నియోజకవర్గాల్లో గడ్డం వెంకటస్వామి కాలం నుంచి ఉన్న పరిచయాలతో ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మాదిగల్లో వ్యతిరేకత తగ్గించి, ఓట్లు పడేలా చేసుకోవడంతోపాటు, ప్రత్యర్థులకు సరిజోడుగా వంశీని నిలబెట్టి లోక్‌సభ ఎన్నికల్లో గెలవాల్సి ఉంది.

సార్ లేడు.. ఫిర్యాదు రాసివ్వండి!



మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్

- మహిళా ఠాణాలో సీఐ, ఎస్సై కుర్చీలు ఖాళీ
- 25 రోజులుగా భర్తీకి నోచుకోని వైనం..
- ఇబ్బంది పడుతున్న బాధిత మహిళలు

మంచిర్యాలక్రైం: మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌కు 25 రోజులుగా బాస్ కరువయ్యారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్‌ను గతనెల 29న ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో తెలంగాణ స్టేట్ ఇంటలిజెన్స్‌లో పని చేస్తున్న వి.వెంకటేశ్వర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్‌కుమార్ ఈనెల 2న రిలీవ్ అయ్యాడు. వెంకటేశ్వర్‌రావు ఇప్పటికీ విధుల్లో చేరలేదు. దీంతో 25 రోజులుగా ఖాళీ కుర్చీ కనిపిస్తోంది. ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఎం.వి జయ్‌కుమార్ సైతం ఈనెల 9న బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం మహిళా పోలీస్ స్టేషన్‌కు ఎస్సై, సీఐ లేరు. సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వస్తున్న మహిళలకు అక్కడి సిబ్బంది 'సార్ లేడు.. ఫిర్యాదు రాసివ్వండి' అని సూచిస్తున్నారు.

మహిళా ఆఫీసర్ కావాలి..

సమస్యలతో, వేధింపులతో బాధపడుతున్న మహిళలకు సముచిత న్యాయం జరగాలంటే మహిళా పోలీస్ స్టేషన్‌లో ఉన్నతస్థాయి అధికారిగా మహిళ ఉండాలని మహిళలు కోరుతున్నారు. జనాభా లెక్కల ప్రకారం మంచిర్యాల జిల్లాలో పురుషులు 3,21,248 ఉండగా మహిళలు 3,26,353 మంది ఉన్నారు. జిల్లాలో మహిళా పోలీస్ అధికారులు మాత్రం 53 మంది మాత్రమే ఉన్నారు. కనీసం మహిళా ఠాణాలో అయినా మహిళా సీఐతోపాటు మహిళా కానిస్టేబుళ్లను నియమించాలని కోరుతున్నారు.

మొదటి నుంచి ఇదే పరిస్థితి..

మంచిర్యాలలో మహిళా పోలీస్‌స్టేషన్ ప్రారంభమైన నాటి నుంచి ఇక్కడ ఎవరూ ఇష్టంగా విధులు నిర్వహించడం లేదు. పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఇక్కడ అందరూ పురుషులే విధులు నిర్వహిస్తున్నారు. ఎస్‌హెచ్‌వోలు సైతం పురుషులే కావడంతో మహిళలు సమస్యలు చెప్పుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఎస్‌హెచ్‌వోగా మహిళా అధి కారిని నియమించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ సీఐ, ఓ ఎస్సై మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించారు. అయినా మహిళా అధికారులను నియమించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ బాధ ను పురుష అధికారులకు ఎలా చెప్పుకోవాలో తెలి యక బాధిత మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

కన్నీటి 'వార్ధా'..!

హోలీ పండుగవేళ.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వార్ధా తీరం కన్నీటి మయమైంది. ఆర్తనాదాలతో మారుమోగింది. అప్పటి వరకు ఉత్సాహంగా రంగుల పండుగ జరుపుకుని స్నానం కోసం వెళ్లిన నలుగురు స్నేహితులను నది పొట్టన బెట్టుకుంది. ఈత రాకపోవడంతో గల్లంతై తిరిగిరాని లోకాలకు చేరుకున్న ఆ మిత్రుల చివరి వేడుక విషాదాంతంగా మారింది. నాలుగు కుటుంబాలకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. విగత జీవులుగా మిగిలిన బిడ్డలను పట్టుకొని గుండెలవిసేలా ఆ తల్లులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

– కౌటాల/చింతలమానెపల్లి

- నలుగురిని మింగిన నది
- స్నానానికి వెళ్లి మృత్యువాత
- అందరూ 25ఏళ్ల లోపు వారే..
- మరణంలోనూ వీడని స్నేహం
- హోలీ వేళ నాలుగు కుటుంబాల్లో విషాదం



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ కరుణాకర్

ఉత్సాహంగా హోలీ చేసుకుని..

కౌటాల మండలం కేంద్రంలోని నదిమాబాద్‌కు చెందిన పనస కమలాకర్(22), ఆలం సాయి(22), ఉప్పుల సంతోష్(25), ఎల్ములె ప్రవీణ్(23), మేడి నవీన్, పసుల సంతోష్ చిన్ననాటి నుంచి ప్రాణ స్నేహితులు. కలిసి చదువుకోకున్నా ఒకే కాలనీలో ఉండడంతో వీరి మధ్య స్నేహం పెరిగింది. సోమవారం హోలీ పండుగ కలిసే జరుపుకున్నారు. మధ్యాహ్నం వరకు రంగులు చల్లుకుని ఎంజాయ్ చేశారు. సెల్ఫీలు దిగారు. తర్వాత మద్యం కొనుగోలు చేసి స్నానాలు చేసేందుకు తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది వద్దకు వెళ్లారు.

మద్యం తాగి స్నానానికి దిగి..

అరుగురూ స్నానం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. తర్వాత ఒడ్డునే కూర్చుని అందరూ వెంటతెచ్చుకున్న మద్యం సేవించారు. అనంతరం నవీన్ అక్కడి నుంచి కౌటాలకు తిరిగి వెళ్లాడు. పసుల సంతోష్‌కు ఫోన్ రావడంతో మాట్లాడుతూ ఒడ్డునే ఉండి పోయాడు. కమలాకర్, ఉప్పుల సంతోష్, ప్రవీణ్, సాయి మాత్రం మరోసారి స్నానం చేసేందుకు నదిలో దిగారు. మద్యం మత్తు, ఈత రాకపోవడం, లోతు అంచనా వేయకపోవడంతో నలుగురూ గల్లంతయ్యారు. గమనించిన సంతోష్ సమీపంలో ఉన్నవారి వద్దకు వెళ్లి సాయం చేయాలని కోరాడు. స్థానికులు నదిలో గాలించగా ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో కౌటాల సీఐ సాదిక్‌పాషా, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నాడు. గజ ఈతగాళ్లను రప్పించి సుమారు నాలుగు గంటలపాటు గాలించారు. అనంతరం నలుగురి మృతదేహాలను బయటకు తీశారు.



సాయి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి దేవమ్మ



కమలాకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి లక్ష్మి



స్నానానికి వెళ్లే ముందు కమలాకర్, సంతోష్ సెల్ఫీ

ప్రమాదానికి కారణాలివే..

నదిలో స్నానానికి వెళ్లి నలుగురు మృత్యువాత పడడానికి ప్రధాన కారణం ఈత రాకపోవడం. నదిలో లోతు అంచనా వేయకుండా స్నానానికి వెళ్లడం, మద్యం తాగి ఉండడం అని పోలీసులు తెలిపారు. ఘటన జరిగిన ప్రాంతంలో నది ప్రవాహం వంపు తిరిగి ఉంది. నదిలో స్నానానికి వెళ్లిన ప్రదేశంలో తీరం నుంచి ఇసుక ఉండగా.. నడుచుకుంటూ వెళ్లిన వారు ఒక్కసారిగా లోతుకు పడిపోయి ఉంటారని స్థానికులు తెలిపారు. మద్యం తాగి ఉండటం, నీటి మట్టం కారణంగా బయటకు రాలేకపోయారని పోలీసులు పేర్కొన్నారు. యువకులు దిగే చోట లోతు ఎక్కువగా ఉందని స్థానిక రైతులు చెప్పినా లెక్క చేయకపోవడంతో అంతా విగత జీవులుగా మారాల్సి వచ్చింది.

మిన్నంటిన రోదనలు..

యువకులు నీటిలో గల్లంతయిన విషయం తెలుసుకున్న వారి కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు, ప్రజలు భారీగా నది వద్దకు చేరుకున్నారు. మృతదేహాలను వెలుపలికి తీయగానే మృతుల కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. 'హోలీ ఆడి ఇంటికి వచ్చి బోర్ వేసుకుని స్నానం చేయమన్నా కదా కొడుకా.. ఇక్కడికి ఎందుకు వచ్చినవ్ కొడుకా..' అంటూ కమలాకర్ తల్లి నది వద్ద కొడుకు మృతదేహాన్ని పట్టుకుని రోదించిన తీరు కదిలించింది.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ, డీఎస్పీ

తాటిపల్లి వద్ద ఘటనా స్థలాన్ని ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ కరుణాకర్ పరిశీలించారు. మృతదేహాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మరో యువకుడు పసుల సంతోష్‌తో మాట్లాడారు. సీఐ సాదిక్ పాషాతో మాట్లాడిన ఎస్పీ మృతదేహాలకు త్వరగా పోస్టుమార్టం ముగించి కుటుంబీకులకు అప్పగించాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. యువకులు నలుగురు మద్యం తాగి నీటిలోకి దిగడంతో ఈత రాక మృతి చెందారని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు.

మృతుల వివరాలు..

- ఆలం శంకర్–దేవమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా, సాయి పెద్ద కుమారుడు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌లో డిగ్రీ చదువుకుంటున్నాడు.
- ఉప్పుల గురుపాదం–శంకరమ్మ దంపతుల చిన్న కుమారుడు ఉప్పుల సంతోష్. తండ్రి గతంలో చనిపోవడంతో ఇంటర్ పూర్తి చేసిన సంతోష్ రైస్‌మిల్లులో పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు.
- పనస వసంత్ – లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. పేద కుటుంబం కావడంతో పెద్ద కుమారుడు కమలాకర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు.
- వాసుదేవ్ – సునీత దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ఎల్ములే ప్రవీణ్. వీరిది రైతు కుటుంబం. ప్రవీణ్ వ్యవసాయంలో తండ్రికి తోడుగా ఉంటున్నాడు. మూడేళ్ల క్రితం వివాహం కాగా, భార్య వకుళ, ఏడాది వయసున్న కుమారుడు వేదాంశ్ ఉన్నాడు. ప్రవీణ్ మృతితో భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం ప్రవీణ్ మేనమామ చౌదరి మారుతి కూడా సిర్పూర్(టి) మండలం టోంకిని వద్ద వార్ధా నదిలోనే గల్లంతై మృతి చెందాడు.

క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో హమాలీకి గాయాలు



గాయపడిన జంగిలి కైలాస్

నెన్నెల: మండల కేంద్రంలో సోమవారం పిచ్చి కుక్క దాడిలో హమాలీ జంగిలి కైలాస్‌కు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కైలాస్ గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లి వస్తుండగా లోటస్ పాఠశాల సమీపంలో పిచ్చి కుక్క దాడిలో అతడి ఎడమ కన్నుకు తీవ్ర గాయమైంది. వెంటనే అతన్ని తోటి హమాలీలు నెన్నెల పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇటీవల రెండు సంఘటనలు మండల కేంద్రంలో జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పిచ్చికుక్కల బెడదను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భీమన్న ఆలయంలో చోరీ



భీమన్న ఆలయం

దహెగాం: మండలంలోని ఏటి గ్రామ సమీపంలోని భీమన్న ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పూజారి నాయిని చిన్నన్న సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లాడు. ఆలయం చుట్టూ పసుపు కుంకుమతో ముగ్గు పోసి ఉండడంతో గ్రామస్తులకు ఈ విషయం చెప్పాడు. వారు అక్కడికి వెళ్లి చూడగా వెండి విగ్రహం, పంచలోహాల విగ్రహం చోరీకి గురైనట్లు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

బెల్లం పానకం ధ్వంసం



ధ్వంసం చేస్తున్న పోలీసులు

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి గ్రామశివారులో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బెల్లం పానకం, డ్రమ్ములు, ఇతర సామగ్రి ధ్వంసం చేసి, గ్రామానికి చెందిన జెట్టి మహేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైన నాటుసారా తయారీ చేసిన విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొడితే ‘ప్రతిష్టాత్మక’ సీటే..

- జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక తర్ఫీదు
- సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- బెల్లంపల్లిలో 47, ఆదిలాబాద్‌లో 67 మంది శిక్షణకు ఎంపిక



పోటీ పరీక్షల శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు ఏటా పోటీపరీక్షల్లో ప్రతిభ కనబర్చి ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో సీట్లు కైవసం చేసుకుంటున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ దీటుగా రాణించి ప్రతిభ పాటవాలు ప్రదర్శిస్తున్నారు. ఈసారి కూడా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బెల్లంపల్లి నుంచి ఎంపిక చేసిన 47 మంది, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల (సీవోఈ) నుంచి 67 మంది పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. ఐఐటీ, నీట్, ఎన్ఐటీ, ఎంసెట్ ద్వారా ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో సీటు సాధించేలా వారికి తర్ఫీదునిస్తున్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ సెల్ ఏర్పాటు చేసి బోధన సాగిస్తున్నారు. దేశంలో ప్రతిష్టాత్మకమైన అజీమ్ ప్రేమ్‌జీ, ఢిల్లీ, సెంట్రల్ యూనివర్సిటీలు, హోటల్ మేనేజ్‌మెంట్, ఐకార్, ఫార్మసీ వంటి కోర్సుల్లో అండర్ గ్రాడ్యుయేషన్‌లో సీట్లు సాధించడానికి జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ముగియడంతో పోటీ పరీక్షల కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సరళంగా అర్థమయ్యే రీతిలో అధ్యాపకులు బోధన చేస్తున్నారు.



బెల్లంపల్లి బాలుర సీఓఈ కళాశాల ముఖద్వారం

సంక్షేమ గురుకులాల్లో తలమానికం..

ఆదిలాబాద్ రీజియన్‌లో 17 ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బాలికలు, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కేంద్రంగా బాలుర సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాలలు ఏర్పాటు చేశారు. మిగతా 15 సాధారణ సంక్షేమ గురుకులాలు ఉన్నాయి. సంక్షేమ గురుకులాల్లో సీఓఈలు భిన్నం. వీటిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు నాణ్యత కలిగిన విద్యాబోధనతోపాటు పోటీ పరీక్షల్లో నెగ్గేలా ఉన్నతంగా తీర్చిదిద్దుతారు. పరీక్ష ఏస్థాయిదైన సరే రాణించి సీటు దక్కించుకుంటున్నారు. అందుకే బెల్లంపల్లి సీఓఈ కళాశాల సంక్షేమ గురుకులాల్లో తలమానికంగా మారింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటుకోవడానికి విద్యార్థులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

ఇంటర్‌లో వందశాతం ఫలితాలు

హైస్కూల్‌గా ఉన్న సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం 2018–19లో ఇంటర్మీడియెట్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయింది. అదే ఏటా నుంచి బెల్లంపల్లి గురుకులాన్నీ సీఓఈగా సంస్థ ప్రకటించింది. కళాశాల నుంచి ఇప్పటివరకు నాలుగు బ్యాచ్‌లు ఇంటర్ విద్య పూర్తి చేసుకున్నాయి. తొలి బ్యాచ్ 65 మంది విద్యార్థులు 2019–20లో విద్య పూర్తి చేసుకుని వందశాతం ఫలితాలు సాధించారు. 2020–21 రెండో బ్యాచ్ విద్యార్థులు 64 మంది పరీక్ష రాసి వందశాతం నెగ్గారు. మూడో బ్యాచ్ 2021–22 సంవత్సరం విద్యార్థులు 73 మంది పరీక్ష రాసి అందరు పాసై రికార్డు సృష్టించగా, 2022–23 విద్యా సంవత్సరంలో 63 మంది పరీక్ష రాయగా వీరిలో 62 మంది పాసయ్యారు. ఒకరు ఫెయిల్ అయ్యారు. ఈసారి ఐదో బ్యాచ్ 64 మంది ఇంటర్మీడియెట్ పరీక్ష రాశారు.

పరీక్షల భయం పోగొట్టేలా..



సీఓఈ విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధ్యాపకుల కృషి ఉంది. ఓవైపు విద్యాబోధన సాగిస్తూనే మరోవైపు ప్రణాళికతో పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ముందుగా పరీక్షల భయం పోగొట్టి, టార్గెట్ సాధించడానికి వారాంతం పరీక్షలు పెట్టి విద్యార్థుల ప్రతిభను అంచనా వేస్తున్నాం. పరీక్షల్లో వారు నెగ్గుకు వచ్చేలా ప్రోత్సహిస్తున్నాం.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్, సీఓఈ కళాశాల బెల్లంపల్లి

ఐఐటీ సీటు సాధిస్తా



సీఓఈలో సీటు రావడానికి కష్టపడ్డా. ప్రవేశ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని లక్ష్యం సాధించా. అదే పట్టుదలతో ఇంటర్ పూర్తిచేసి ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఐఐటీ సాధించి టార్గెట్ చేధిస్తా.

– దుర్గం చరణ్ తేజ్, ఎంపీసీ విద్యార్థి, బెల్లంపల్లి

మద్రాస్ ఐఐటీ సీటే లక్ష్యం



మద్రాస్ ఐఐటీలో సీటు సాధించాలనేది నా కోరిక. అందుకోసం పూర్తి దృష్టంతా పోటీ పరీక్షపైనే నిలిపా. అధ్యాపకులు చెబుతున్న అంశాలను శ్రద్ధగా వింటున్నా. ఐఐటీ సీటు దక్కించుకుని నా కల నెరవేర్చుకుంటా.

– తీగల అశ్రిత్, బెల్లంపల్లి

ప్రత్యేక క్యాంపుతో ఉపయోగం



ఇంటర్ వార్షిక పరీక్షలు ముగియడంతో సీఓఈలో పోటీ పరీక్షల కోసం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నారు. సరళంగా అర్థమయ్యే రీతిలో బోధన చేస్తున్నారు. ఈ తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. పోటీ పరీక్షల్లో మెరుగైన మార్కులు తెచ్చుకుని సీటు దక్కించుకుంటా.

– మౌల్కర్ శివకృష్ణ , బైపీసీ విద్యార్థి, బెల్లంపల్లి

డాక్టరే లక్ష్యం



డాక్టర్ కావాలనేది నా కోరిక. ఎంబీబీఎస్ సీటు సాధించడం ఆషామాషీ కాదనే విషయం నాకు తెలుసు. అధ్యాపకులు చెబుతున్న అంశాలను క్షుణ్ణంగా చదివి గుర్తు పెట్టుకుంటున్నా. అనుకున్న లక్ష్యం నెరవేర్చి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తెస్తా.

– జుమ్మిడి ప్రణయ్, బైపీసీ విద్యార్థి, బెల్లంపల్లి

బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ట్రాలీ ఆటో

జైనూర్: మండలంలోని పట్నాపూర్ గిరిజన ఆశ్రమ బాలిక పాఠశాల నుంచి బియ్యాన్ని ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. ట్రాలీ ఆటోలో 15 సంచుల బియ్యం అక్రమంగా తరలించేందుకు యత్నించగా విద్యార్థినులు అడ్డుకున్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్ఎం జాదవ్ పర్శురామ్‌ను వివరణ కోరగా లోన్‌పై బియ్యం తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కాగా, అక్రమంగా బియ్యం తరలించడంపై విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి ఒకరి మృతి



పెద్ద ఎర్రన్న మృతదేహం

నిర్మల్: సారంగపూర్ మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన తాండ్ర పెద్దఎర్రన్న (50) ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని వాగులో పెద్ద ఎర్రన్న సోమవారం స్నానం చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాగులో కాలు జారి పడి మృతిచెందాడు. స్థానికులు గమనించి మత్స్యకారుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుమార్తె భీమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు ఒకరి మృతి

తానూరు: మండలంలోని బామ్నితండా గ్రామానికి చెందిన జాదవ్ గణేశ్ (58) సోమవారం పాము కాటుతో మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సాయంత్రం ఇంటి ఆవరణలో ఆయనకు పాము కాటేసింది. గమనించిన కుటుంబీకులు భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

పండుగ పూట విషాదం

- కాలువ నీటిలో మునిగి ఇంటర్ విద్యార్థి మృతి
- దండేపల్లి మండలంలో ఘటన



కార్తీక్(ఫైల్)



కార్తీక్ మృతదేహం

దండేపల్లి: పండుగ పూట ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. హోలీ ఆడుకుని స్నేహితులతో కలిసి కాలువలో స్నానానికి వెళ్లి ఈత రాక ఇంటర్మీడియెట్ విద్యార్థి నీటమునిగి చనిపోయిన ఘటన దండేపల్లి మండలంలో చోటు చేసుకుంది. దండేపల్లి ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం ప్రకారం.. జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోపులపురం ప్రసాద్, అశ్విని దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రసాద్ ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. ఇంటర్మీడియెట్ విద్యార్థి, పెద్ద కుమారుడు కార్తీక్(18) గత ఐదు రోజుల క్రితం తల్లి అశ్వినితో కలిసి దండేపల్లి మండలం పాత మామిడిపల్లిలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. సోమవారం హోలీ సందర్భంగా స్నేహితులతో కలిసి ఆడుకున్నాడు. అనంతరం వారితో కలిసి తానిమడుగు వద్ద గూడెం ఎత్తిపోతల డెలివరీ పాయింట్ వద్ద కడెం ప్రధాన కాలువలో స్నానం చేసేందుకు వెళ్లాడు. దీంతో అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే అతన్ని బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని వెంటనే మేదరిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అమ్మమ్మ ఇంటికి వచ్చి..

ఇంటర్ పరీక్షలు ముగియడంతో, కాలేజీకి సెలవులు వచ్చాయి. కార్తీక్ తన తల్లి అశ్వినితో కలిసి ఐదు రోజుల క్రితం పాతమామిడిపల్లిలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి సంతోషంగా స్నేహితులతో గడుపుతున్నాడు. ఇంతలో సోమవారం హోలీ పండుగ రావడంతో, స్నేహితులతో కలిసి హోలీ ఆడుకున్నాడు. స్నానం కోసం కాలువ వద్దకు వెళ్లిన అతను స్నానం చేసేందుకు నీటిలో దిగాడు. ఈత రాక నీటిలో మునిగి చనిపోయాడు. కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొడుకుపై పెట్టుకున్న ఆశలు అతని అకాల మృతితో ఆవిరయ్యాయి.

ఆదిలాబాద్‌లో మరో విద్యార్థి మృతి

ఆదిలాబాద్‌రూరల్: పండుగ పూట స్నానానికి వెళ్లి వాగులో గల్లంతై విద్యార్థి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో విషాదం నింపింది. ఆదిలాబాద్‌రూరల్ మండలం భీంసరి శివారులో గల వాగులో స్నానానికి వెళ్లి గుమ్ముల సాత్విక్ (14) అనే విద్యార్థి మృతి చెందాడు. ఎస్సై ముజాహిద్, స్థానికుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని జై జవాన్‌నగర్ కాలనీకి చెందిన గుమ్ముల స్వర్ణలతకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లిదండ్రుల మధ్య మనస్పర్థలు రావడంతో వారికి కొన్నేళ్ల క్రితం విడాకులయ్యాయి. ఇద్దరి పిల్లలను తల్లి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పోషిస్తోంది. చిన్నారులిద్దరూ పట్టణంలోని తిర్పెల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. సాత్విక్ సోమవారం హోలీ సంబరాలు చేసుకొని అనంతరం స్నానానికి మిత్రులతో కలిసి వాగుకు వెళ్లాడు. స్నేహితులంతా వాగు ఒడ్డున నిలబడి ఉండగా.. స్నానం చేస్తానని సాత్విక్ అందులోకి దూకాడు. ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. ఈతగాళ్లు బయటకు తీసి చికిత్స నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మంచిర్యాలక్రైం: హోలీ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలో బంగ్ డ్రింక్ తాగేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. పాత రతన్‌లాల్ హోటల్ సమీపంలో నిర్వాహకులు సోమవారం విక్రయించగా, యువకులు ఎగబడి తాగారు. ఇదో మత్తు పానీయమని, ఏ మూడ్‌లో ఉండి ఈ డ్రింక్ తాగితే అదే మూడ్‌లో ఉంటారని చెబుతున్నారు. 40 రకాల డ్రైఫ్రూట్స్‌తో ఈ డ్రింక్ తయారు చేస్తామని పేర్కొన్నారు. గత 8 ఏళ్ల నుంచి ఈ డ్రింక్ తాగుతున్నానని ఓ యువకుడు చెప్పాడు.

ఎఫ్ఎల్ఎన్‌కు బాసట..!



గంపలపల్లి ఎంపీపీఎస్‌లో ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షిస్తున్న నోడల్ అధికారి

- భత్యంతో ఎంఎన్‌వోలకు ఊరట

మంచిర్యాలఅర్బన్: జాతీయ విద్యావిధానంలో అమలు చేస్తున్న అంశాలను అందుకునేందుకు విద్యాశాఖ దృష్టిపెట్టింది. ప్రాథమిక స్థాయిలో అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపర్చే సంకల్పంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం చేపట్టారు. పూర్వ ప్రాథమిక, ప్రాథమికస్థాయిలో విద్యార్థి అభ్యాసన సామర్థ్యాల పెంపు లక్ష్యంగా ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమ పర్యవేక్షణకు గతేడాది ప్రతి మండలానికి నోడల్ అధికారిని నియమించింది. క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి ప్రగతి నివేదించాలని ఆదేశించింది. ఇందుకు పర్యవేక్షణ అధికారులకు భత్యాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ప్రతీ నెల రూ.600 భత్యాన్ని ఇస్తామని ప్రకటించింది. పదినెలలకు సంబంధించిన భత్యాలు విడుదల చేసింది. 18 మండలాలకు చెందిన నోడల్ అధికారులకు నెలకు రూ 600 చొప్పున మొత్తం రూ.6 వేలు చెల్లించనున్నారు. భత్యం విడుదలతో వారికి కొంతమేర ఊరటనిస్తుంది.

రిసోర్స్‌పర్సన్‌లకు కూడా..

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ నిర్వహణపై జిల్లాలో ఉపాధ్యాయులకు మూడు రోజుల చొప్పున ఆరుగురు రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. ఆయా మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు కార్యక్రమం అమలుపై 108 మంది ఆర్పీలు అవగాహన కల్పించారు. వీరికి మూడు రోజుల కిందట ఒక్కొక్కరికి రూ.400 చొప్పున భత్యం నిధులు విడుదలయ్యాయి. మంచిర్యాల జిల్లాకు చెందిన రిసోర్స్‌పర్సన్‌లకు రూ.97,200 నిధులు రాగా ఖాతాలో జమచేశారు.

ఉమ్మడి జిల్లా వారీగా..

జిల్లా	మండలాలు	కేటాయించిన నిధులు
మంచిర్యాల	18	రూ.10,800,00
ఆదిలాబాద్	18	రూ.1,08,000
కుమరంభీం	15	రూ.90,000
నిర్మల్	19	రూ.1,14,000

ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలు ఇవిగో..

ఎఫ్ఎల్ఎన్‌తో బడుల్లో చిన్నారులు కనీస సామర్థ్యలతోపాటు తరగతి అభ్యాసన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ లక్ష్యం పెట్టుకుంది. ఇందుకు ఆయా పాఠశాలల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు మూడు విడతలుగా శిక్షణ కల్పించారు. వీరందరూ సంబంధిత పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన అందించటం..సామర్థ్యాలు పెంపునకు విద్యార్థులకు అభ్యాసన పుస్తకాలు విడతల వారీగా పంపిణీ చేసింది. నిర్దేశించిన సామర్థ్యాల కార్యక్రమం అమలుకు మండలానికి నోడల్ అధికారిని ఎంపిక చేశారు. ఎంఎన్‌వోల పర్యవేక్షణలో ఉపాధ్యాయుల ద్వారా చదవడం, రాయడం పూర్తిస్థాయిలో అందించాలనే ముఖ్య ఉద్దేశం. కార్యక్రమం అమలుకు పాఠశాలలను సందర్శనకు వెళ్లే ఎంఎన్‌వోల భత్యంను త్వరలో చెల్లించనున్నారు.

మా కష్టాలు దూరం చేస్తానని..

- నువ్వు దూరమైతివా బిడ్డా...!
- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- తల్లికి గాయాలు
- పండుగ పూట తీవ్ర విషాదం
- మాలగురిజాలలో విషాదచాయలు



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన బైక్



అజయ్ పవన్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: ఉద్యోగం చేసి ఇళ్లు కట్టుకుని మా కష్టాలు దూరం చేస్తానని చెప్పి.. నువ్వే దూరమైతివా కొడుకా మాకు దిక్కెవరూ..బిడ్డా..మమ్మల్ని చూసుకునేది ఎవరూ..ఆకలి అయితాంది అంటివి కదా..లేచి రా కొడుకా అందరం కలిసి అన్నం తిందామంటూ ఓ తండ్రి కొడుకు మరణవార్త విని రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. ఈ హృదయ విదారక ఘటన బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దుగుట తిరుపతి, లలిత దంపతులకు ఇద్దరు కుమారులు అజయ్ పవన్ (24), శైను పవన్ ఉన్నారు. అజయ్ పవన్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇటీవల బీటెక్ పూర్తిచేశాడు. ఇంటి వద్దనే ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అజయ్ ఖాళీ సమయంలో కిరాణాషాపులో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం షాపులో ఉన్న అతడు తన తండ్రికి ఫోన్ చేసి ఆకలిగా ఉంది నువ్వు రా నేను ఇంటికెళ్తా అని చెప్పడంతో వచ్చాడు. తర్వాత అజయ్ ఇంటికి చేరుకున్న క్రమంలో తల్లి లలిత ఇంట్లో ఉన్న చెత్తని గ్రామ సమీపంలో పారేసి వద్దామని చెప్పడంతో ఇద్దరు బైక్‌పై నెన్నెలకు వెళ్లే ప్రధాన రహదారిపై బయల్దేరారు. గ్రామ శివారులోకి వెళ్లగానే నెన్నెల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న లారీ(టిప్పర్)ని డ్రైవర్ వేగంగా రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్ నుజ్జునుజ్జయింది. దీంతో అజయ్ పవన్ తలకు, లలిత కుడి కాలుకి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అజయ్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. లలితను మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్ ఘటనాస్థలిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశలు గాలిలో..

అజయ్‌పవన్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఉద్యోగం సాధించి తమ కష్టాలను తీరుస్తానని తల్లిదండ్రులతో చెబుతుండేవాడు. ఉద్యోగం సాధించి హైదరాబాద్‌లోనే ఇళ్లు కొనుకుందామని అనేవాడు. కానీ ఆ ఆశలన్నీ అడియాసలు అయ్యాయి. లారీ రూపంలో వచ్చిన ఆ మృత్యువు వారి ఆశలను గాలిలో కలిపింది. హోలీని సంతోషంగా జరుపుకున్న ఆ కుటుంబంలో కొడుకు మృతితో విషాదం నెలకొంది.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

- డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై చర్యకు డిమాండ్



ఆందోళన చేస్తున్న అద్దెబస్సుల డ్రైవర్లు.

మంచిర్యాలఅర్బన్: జగిత్యాల జిల్లా ధర్మపురి బస్టాండ్‌లో మంచిర్యాల డిపో బస్సు డ్రైవర్, కండక్టర్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని డిపో పరిధిలోని అద్దెబస్సుల డ్రైవర్లు సోమవారం విధులు మహిష్కరించారు. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు బస్సులు నిలిపివేసి నిరసన తెలిపారు. ధర్మపురి బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రౌఇ 7.30 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు దిగే క్రమంలో ప్రయాణికుల మధ్య వాగ్వివాదం జరిగి కొట్లాటకు దారితీసింది. ఓప్రయాణికుడు మరో ప్రయాణికుడిని కొట్టడాన్ని అడ్డుకోబోయిన కండక్టర్ అశోక్, డ్రైవర్ మధుకర్‌రెడ్డిని సదరు వ్యక్తి దుర్భాషలాడటమే కాకుండా పిడిగుద్దులు గుద్దారు. ఈ ఘటనను నిరసిస్తూ సోమవారం తోటి డ్రైవర్లు మంచిర్యాల డిపో వద్ద ఆందోళన చేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని, దాడిచేసి వ్యక్తిపై చర్య తీసుకోవాలని డిమాండ్‌చేశార. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రవీంద్రనాథ్ డ్రైవర్లు, కండక్టర్లతో చర్చించారు. దాడికి పాల్పడిన వారిపై చర్య తీసుకుంటామని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించి విధుల్లో చేరారు.

రెండు రోజుల్లోనే..

ఆర్టీసీ మంచిర్యాల డిపోలో రెండు రోజుల వ్యవధిలో కండక్టర్, డ్రైవర్లపై దాడులు జరగడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లుతున్న అద్దెబస్సు ఏసీసీ సమీపంలో హారన్ వినియోగించారనే నెపంతో ఓవాహనదారుడు అద్దె బస్సు డ్రైవర్‌పై చేయి చేసుకున్నాడు. ఈసంఘటన మరువక ముందే ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ధర్మపురి బస్టాండ్‌లో డ్రైవర్, కండక్టర్‌పై చేయిచేసుకున్నారు. డీఎం రవీంద్రనాథ్ మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లు ఏమైనా తప్పు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమన్నారు. గతంలో ఇదే మాదిరిగా వ్యవహరించిన వ్యక్తులపై కేసు నమోదు చేయించామన్నారు.